శిథిల బడులు

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు ప్రస్తుతం కొన్ని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని ప్రమాదకరంగా మారాయి. గదులకు పగుళ్లు ఏర్పడడం, భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షాలకు పైకప్పు నుంచి ఊరుస్తోంది. ప్రమాదకరంగా ఉన్న భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలను తాత్కాలికంగా వేరేచోట నిర్వహిస్తున్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే శిథిల భవనాలను కూల్చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కూలడానికి సిద్ధంగా భవనాలు
- కొన్నిచోట్ల గదులకు పగుళ్లు
- పైకప్పు పెచ్చులూడుతున్న వైనం
- పాత భవనాలతో పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు


దార్‌కుభీర్ పాఠశాల భవనం

కుభీర్‌లో..


సిర్పెల్లి పాఠశాల భవనం

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్, రాజూరా, పల్సి ఉన్నత పాఠశాల పాత భవనం, సిర్పెల్లిలో భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఇటీవల అంతర్ని గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూలి అందులో ఆడుకుంటున్న ఇద్దరు బాలురు సాయికుమార్, ప్రేమ్‌కుమార్ తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అధికారులు స్పందించి పాత భవనాలను కూల్చివేసేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూల్చివేయాలి



మా గ్రామంలో పాఠశాలకు నూతన భవనం నిర్మించారు. తరగతులు నిర్వహించడం లేదు. పాత భవనం పక్కనే కొత్తగా కట్టిన రెండు గదులు ఉన్నాయి. బడి అక్కడే నడుస్తుంది. కూలడానికి సిద్ధంగా పాత భవనాన్ని కూల్చివేయాలి.

– తోకల మారుతిదార్ కుభీర్

వివరాలు సేకరించాం

పాఠశాలల పాత భవనాల వివరాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. పంచాయతీ కార్యదరుల ద్వారా వివరాలు సేకరించాం. సోమవారం నుంచి పాత భవనాలను కూల్చేపని ప్రారంభిస్తాం.

– ఆర్.విజయ్‌కుమార్, ఎంఈవో, కుభీర్

కడెంలో..


కడెం జెడ్పీ పాఠశాల ఆవరణలో శిథిల భవనం

కడెం: మండల కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శిథిల భవనం ప్రమాదకరంగా మారింది. ఇందులో తరగతులు నిర్వహించడం లేదు. పాఠశాల ఆవరణలో ఉండడం, పక్కనే ఎస్సీ వసతి గృహం ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. నచ్చన్‌ఎల్లాపూర్ గొండుగూడలో ఆశ్రమ పాఠశాల శిథిలమైన పెంకుటిల్లులో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పక్కా భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నచ్చన్‌ఎల్లాపూర్ గొండుగూడ ఆశ్రమ పాఠశాల

తానూరులో..

తానూరు: మండలంలోని కళ్యాణి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం .. రెండేళ్ల క్రితం గ్రామస్తులు సమీపంలోని రైతు వేదిక కార్యాలయంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం గ్రామంలో ఉండడంతో అక్కడే చిన్నారులు ఆడుకుంటున్నారు.


కళ్యాణి ప్రాథమిక పాఠశాల భవనం

పాఠశాల భవనాల పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని రాజూర, లోకేశ్వరం, భాగాపూర్, నగర్, పిప్రి, పంచగుడి, కన్కపూర్ గ్రామాల్లో శిథిలావస్థలకు చేరిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఆర్‌అండ్‌బీ ఏఈ విశాల్ ఇటీవల పరిశీలించారు. శిథిలావస్థలకు చేరిన పాఠశాలల నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.


రాజూరలో పాఠశాల భవనం పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఏఈ విశాల్

క్లుప్తంగా

మున్సిపల్‌లో ప్రధాని ఫొటో ఏర్పాటు


ప్రధాని ఫొటో ఏర్పాటుచేస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రధాని మోదీ ఫొటోను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ప్రధాని ఫొటో ఏర్పాటుచేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తామే సొంత ఖర్చులతో ఏర్పాటుచేశామన్నారు. నాయకులు అనిల్ రావు, జెట్టి సురేందర్, చందుపట్ల శ్రావణ్, కొండవేని రమేశ్, దాసరి శ్రీనివాస్, ప్రశాంత్, సుమంత్ తదితరులు ఉన్నారు.

గుంత పూడ్చారు


గుంతను పూడ్చివేసిన పంచాయతీ సిబ్బంది

సాక్షి స్పందన

భైంసారూరల్: మండలంలోని గుండేగాం పంచాయతీ కార్యాలయం ముందు గుంత ఏర్పడింది. రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న తీరు గురించి ఈనెల 2న «ప్రమాదకర గుంత పూడ్చరూ» శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి నవీన్ గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించారు.

పరిశుభ్రత పాటించాలి


గోసంపల్లె పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీవో రత్నాకర్‌రావు

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మండలంలోని మస్కాపూర్, గోసంపల్లి, బాదనకుర్తి ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పరిసరాలతో పాటు పాఠశాలల్లో శుభ్రత చేపట్టాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల సందర్శన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద, బోరిగాం, బాబాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో రాధ, ఎంఈవో అశోక్‌వర్మ మంగళవారం సందర్శించారు. గురువారం నుంచి బడులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో సందర్శించినట్లు తెలిపారు. ఎంపీవో అమీర్ ఖాన్ ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


పిచ్చిమొక్కలు తొలగింపును పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి నవీన్

భైంసారూరల్: గత రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గుండేగాం గ్రామస్తులకు రెవెన్యూ అధికారులు భైంసా పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో పునరావాసం కల్పించారు. అప్పటి నుంచి డబుల్ బెడ్రూంలలోనే ఈ గ్రామస్తులు జీవనం వెళ్లదీస్తున్నారు. డబుల్ బెడ్‌రూంల సమీపంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను మంగళవారం పంచాయతీ సిబ్బందితో తొలగించారు. కార్యదర్శి నవీన్ గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు.

అందుబాటులో విత్తనాలు

ముధోల్: మండలకేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిశోధన స్థానం ఏరువాక కేంద్రంలో రైతులకు సోయాబీన్, కందులు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త డాక్టర్ ఈ.నర్సయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోయాబీన్ జేఎస్ 335 రకం 25 కేజీల బస్తా రూ.3200 బాసరలో లభిస్తాయని పేర్కొన్నారు. కందులు టడీఆర్ జీ–59 రకం 6 కేజీల బస్తా రూ.900, డబ్లూర్‌జీఇ రకం 4 కేజీల బస్తా రూ.600 ఉంటుందని తెలిపారు. కావల్సిన రైతులు నేరుగా పరిశోధన స్థానానికి వచ్చిన విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. వివరాలకు 9885551624, 9989623816లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం..

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. కొలాంగూడ పంచాయతీ పరిధి కుసుంపూర్ గ్రామంలో ఆత్రం దురవు ఇంటి పైకప్పు కొట్టుకుపోయింది. వారి ఇంటి ఆవరణలోని కరెంట్ స్తంభం విరిగిపడి ఆవు దూడ చనిపోయింది. ఆ పైకప్పు తగిలి దరువు భార్య సుంగుబాయి తలకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకుడు కొదారి నరేశ్ గాయపడ్డాడు. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని తహసీల్దార్ సుజాత తెలిపారు. దిలావర్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని వాటర్‌ట్యాంక్‌కు ఏర్పాటుచేసిన ఇనుప మెట్లు కింద పడిపోయింది.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కుంటాల మహాలక్ష్మి ఆలయ సమీపాన చెట్టు విరిగి అంబకంటి నుంచి కుంటాలకు వస్తున్న లారీపై చెట్టు ఒరిగిపడింది. విద్యుత్ సిబ్బంది శ్రీనివాస్, జేసీబీతో చెట్టును లారీపై తొలగించడంతో ప్రమాదం తప్పింది. గ్రామాల్లో సరఫరా నిలిచింది. అధికారులు మరమ్మతు చేపట్టి పునరుద్ధరించారు. వర్షంతో కల్లూరు వాగులోకి వరదనీరు చేరింది. 6 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.


కుసుంపూర్‌లో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్‌లో ప్రధాన రోడ్డు వర్షపు నీరు నిలిచింది. భైంసా నుంచి కుభీర్ వెళ్లే మార్గంలో మిర్జాపూర్ బస్టాండ్ వద్ద నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కురిసిన వర్షం.. రైతుల హర్షం

ముధోల్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తంచేశారు. మృగశిర కార్తె మరుసటి రోజు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పంట పొలాల్లో రైతులు విత్తనాలు విత్తేందుకు ముందుస్తుగా ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధమయ్యారు. కాగా, భారీ వర్షానికి చెట్లు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

డ్రైడే పకడ్బందీగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో రాజేందర్

సోన్: డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రై డే కార్యక్రమాన్ని ప్రతీ శుక్ర, మంగళవారాల్లో నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, పగిలిపోయిన రంజన్లు, కొబ్బరి చిప్పలు టైర్లు, కొబ్బరి బొండాలు, పగిలిపోయిన కుండలు, కూలర్లలో నీటిని తొలగించాలని సూచించారు. డాక్టర్ ఆశిష్ రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, వైద్యాధికారులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్

'సాక్షి' కార్యాలయాలపై దాడి అప్రజాస్వామికం

కడెం: జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్, ఏపీలో సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం అప్రజాస్వామికమని కడెం మండల జర్నలిస్టులు, ప్రజా సంఘల నాయకులు అన్నారు. కొమ్మినేని శ్రీనివాస్‌రావు అక్రమ అరెస్టను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ శారదకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు తక్కల్ల రవీందర్, జర్నలిస్టులు రాచకొండ రవీందర్, అల్లాడి రంజిత్, దశగౌడ్, రాపర్తి వెంకటేశ్, కాకెర రమేశ్, సంగెం చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భుక్యా రమేశ్, అంబేద్కర్ సంఘ నాయకుడు ఆర్ల రమేశ్, తదితరులు ఉన్నారు.


ఆర్‌ఐ శారదకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

ఆధునిక పద్ధతులు పాటిస్తే దిగుబడి

కుంటాల: పంటల సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చని ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక శాస్త్రవేత్తలు నర్సయ్య, విజయ్‌కుమార్, కార్తీక్ సూచించారు. మంగళవారం మండలంలోని అంబకంటి గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక, ప్రభుత్వ పథకాలపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్దకు నేరుగా వెళ్లి పంటలను సందర్శించారు. సేంద్రియ వ్యవసాయం, నీటిపారుదల, చీడపీడల నియంత్రణ, భూసార పరీక్షలు, సాగు పద్ధతులను వివరించి అవగాహన కల్పించారు. ఏవో విక్రమ్, హార్టికల్చర్ ఆఫీసర్ షేక్ జావిద్ పాషా, ఏఈవోలు హర్షిత, శ్రీనివాస్, గణేశ్ చైతన్య ఉన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నర్సయ్య

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి పూజలు

భైంసాటౌన్/భైంసారూరల్/తానూరు: భైంసా పట్టణంలో వటసావిత్రి పూర్ణిమను మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రావి చెట్టు ప్రదక్షిణలు చేస్తూ, తమ మాంగళ్యబంధం బలంగా ఉండాలని మొక్కుకున్నారు. అంతేగాక, పాడి పంటలు, ఆరోగ్యం బాగుండాలని మొక్కుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రావిచెట్టుకు పూజల అనంతరం ఒకరినొకరు వాయినాలు ఇచ్చుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. భైంసా, తానూరు మండలాల్లో మహిళలు మేడి చెట్టుకు ప్రదక్షిణలు నిర్వహించి పూజలు చేశారు.


తానూరు: సింగన్‌గాం గ్రామంలో పూజలు చేస్తున్న మహిళలు

ఆత్మ చైర్మన్లకు సన్మానం


సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: భైంసా, ముధోల్ ఆత్మ చైర్మన్లుగా నియమితులైన సిద్ధం వివేకానంద, గన్ను నర్సారెడ్డిని కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ సన్మానించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం సత్కరించి అభినందించారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీగా నియమితులైన అంబటి రాజేశ్వర్‌ను సన్మానించారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

కడెం: కేంద్ర పథకాలు, ప్రధాని మోదీ సుపరిపాలనపై ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్, మండల ఇన్‌చార్జి అంకం మహేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 21 యోగా దినోత్సవం జరుపుకోవాలని సూచించారు. నాయకులు జక్కుల సత్తెన్న, శ్రీరాం, ధర్మపురి తిరుమల్, నల్గొండ, తోట రాజేశ్, బుర్రసాయిగౌడ్, ప్రవీణ్, నర్సయ్య, లక్ష్మణ్, భానుచందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందేలా చూడాలి

ఖానాపూర్: ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలనను పార్టీ శ్రేణులు బూత్‌స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ అన్నారు. మండలంలోని తర్లపాడ్‌లో మంగళవారం జరిగిన బీజేపీ కార్యశాలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈనెల 21న యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. అనంతరం పలు మొక్కలు నాటారు. నాయకులు గడ్డం రవీందర్, పుప్పాల పవన్, కంతి లింబాద్రి, బట్టు వరుణ్, పెద్ది రమేశ్, నరేందర్, చంద్రశేఖర్, కాలేరి రాజేందర్, గంగరాజం, రఘు, స్వామి, భూమాగౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


కడెం: మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ పట్టణాధ్యక్షుడు రావుల రాము తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ అనిల్, కోకన్వీనర్ దిలీప్, దగ్గే శ్రీకాంత్, సుభాష్, పోశెట్టి, శ్రీనివాస్, సాహెబ్ రావు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

చిన్నారులకు పుష్పగుచ్ఛం ఇచ్చి.. పూలు చల్లి

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ మాట అంగన్‌వాడీ బాటను వినూత్న పద్ధతుల్లో నిర్వహించారు. పట్టణంలోని బర్కత్‌పుర కేంద్రంలో టీచర్ వరలక్ష్మి మంగళవారం అంగన్‌డీ బాట కార్యక్రమం నిర్వహించడంతోపాటు చిన్నారులకు పుష్పగుచ్చాలు ఇవ్వడంతోపాటు కేంద్రంలో పూలు చల్లి స్వాగతం పలికారు. తొలిరోజు కేంద్రానికి వచ్చిన చిన్నారులు ఆటాపాటలతో ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు. కాలనీవాసులు జియా, మజర్, ఈసా, ఆయూబ్ తదితరులు ఉన్నారు.

దోమతెరల పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ రైతువేదికలో వరల్డ్ విజన్ ఇండియా, నిర్మల్ ఏడీపీ ఆధ్వర్యంలో చిన్నారులకు మంగళవారం దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరల్డ్ విజన్ జిల్లా కోఆరినేటర్ బ్రహ్మన్న మాట్లాడుతూ 180 కుటుంబాలకు చెందిన 2040 మంది చిన్నారులకు రూ.4 లక్షల 8 వేల విలువ దోమతెరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు వీటిని అందినట్లు పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు అనిల్‌కుమార్, శ్రీలత, ఎంపీవో అమీర్‌ఖాన్, వరల్డ్ విజన్ కోఆర్డినేటర్లు అజయ్, వలంటీర్లు సుమలత, నిఖిల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చూడాలి

లోకేశ్వరం: వర్షాల కారణంగా ఇంటి ఆవరణలో నీరు నిల్వకుండా చూడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో కాలి డ్రమ్ములు, టైర్లల్లో ఇతర సామగ్రిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆశ, ఆరోగ్యకార్యకర్తలు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ముత్యం సూచించారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన కార్మికులకు మధ్యాహ్న భోజనంపై శిక్షణ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పథకం అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు, కార్మికులు పాల్గొన్నారు.

పీసీసీ కార్యవర్గంలో రాజేశ్వర్


రాజేశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో పార్టీ సీనియర్ నాయకుడు ఎంబడి రాజేశ్వర్‌కు చోటుదక్కింది. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత 33 ఏళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు కృషిచేసిన రాజేశ్వర్‌కు పీసీసీ కార్యవర్గంలో చోటుదక్కడంపై జిల్లా ప్రజలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి ఎస్పీ ప్రజావాణి వాయిదా

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించే ప్రజావాణి వాయిదా పడినట్లు కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

కరాటే గ్రేడింగ్ పోటీలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 మందికి మంగళవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జూనియర్ కరాటే రెడ్‌బెల్ట్, గ్రీన్‌బెల్ట్, ఆరెంజ్ బెల్ట్, ఎల్లో బెల్ట్ తదితర బెల్ట్‌లతోపాటు గుర్తింపు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎగ్జామినర్ తేజేందర్ సింగ్ భాటియా, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కరాటే మాస్టర్లు ఆరిఫ్‌ఖాన్,నిహార్, నారాయణ, కిషన్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ భాటియా

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుజాత కోరారు. మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సదస్సులో సీనియర్ అసిస్టెంట్ సబిత ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఆర్‌ఐలు సత్యనారాయణ, నాగేశ్, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లిలో జరిగిన సదస్సులో 11, మోతక్‌పల్లిలో 2, రాంపూర్‌లో 16 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. డీటీ వాహీదోద్దీన్, ఆర్‌ఐలు సుమలత, నవత జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.